# ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి


కదిరి పట్టణంలో కంటి వైద్య పరీక్షలను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి


ధర్మవరంలో కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ జయరామిరెడ్డి

**కదిరి టౌన్:** జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిరుపేదలకు ఒక వరంగా మారాయని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని వాటర్ ట్యాంక్ వార్డు సచివాలయ పరిధిలోని గరల్స్ హైస్కూల్ వద్ద శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు మేలు జరుగుతోందన్నారు. ఆరోగ్య సిబ్బంది మెరుగైన వైద్యాన్ని పేదల ఇంటి వద్దకే అందిస్తున్నారని తెలిపారు. సీఎం జగన్ విద్య, వైద్యానికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. అనంతరం వైద్యులు అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేశారు. రోగులకు సురక్ష కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు, వార్డు కౌన్సిలర్ కిన్నెర కళ్యాణ్, పట్టణ అధ్యక్షుడు జిలాన్, వైఎస్సార్ సీపీ నాయకులు ఓంప్రకాష్, శంకర్, మురళి, ఎంఈఓ చెన్నకృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**ధర్మవరం:** ప్రజలందరి ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. పట్టణంలోని శివానగర్, నేసేపేట సచివాలయాల పరిధిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా వైద్య శిబిరం జరిగింది. కంటిచూపు తగ్గిన 88 మందికి ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలందరికీ వైద్యం అందించాలనే లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కుండా చౌడయ్య, బ్రహ్మయ్య, మున్సిపల్ మేనేజర్ ఆనంద్‌కుమార్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**పుట్టపర్తి రూరల్:** జగనన్న ఆరోగ్య సురక్షతో పేద ప్రజల ఆరోగ్యానికి చక్కటి భరోసా లభిస్తోందని వైస్ చైర్మన్ తిప్పన్న, మున్సిపల్ విప్, కౌన్సిలర్ సాయిగీత, మున్సిపల్ సచివాలయాల కన్వీనర్ సూర్యాగౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని జెండా వేపమాను ఎంపీపీ స్కూల్ వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో ముగ్గురు వైద్యులు పాల్గొని 250 మంది రోగులకు ఓపీ సేవలు అందించారు. అనంతరం ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదల చెంతకే స్పెషాలిటీ వైద్యాన్ని తీసుకొచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ అర్బన్ కన్వీనర్ రంగారెడ్డి, కౌన్సిలర్ చెరువు భాస్కర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ లక్ష్మీనారాయణరెడ్డి, నాయకులు లింగాల భాస్కర్‌రెడ్డి, పట్టణ వైద్యుడు డాక్టర్ ఫణీంద్రసాయి, మున్సిపల్ ఏఈ, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, వలంటీర్లు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## రూ.25,429 రికవరీకి ఆదేశం


ఓడీచెరువులో వివరాలు వెల్లడిస్తున్న అధికారులు


నల్లమాడలో పనులపై చర్చిస్తున్న అధికారులు

**నల్లమాడ:** 2022–23 ఆర్థిక సంవత్సరంలో మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులపై శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ బహిరంగ వేదిక నిర్వహించారు. వైస్ ఎంపీపీ కే.సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో న్యాయ నిర్ణయాధికారిగా డ్వామా పీడీ రామాంజనేయులు వ్యవహరించారు. ఏపీఓ సూర్యనారాయణ మాట్లాడుతూ.. ఉపాధిహామీ పథకంలో 668 పనులకు రూ.8.93 కోట్లు, పంచాయతీ రాజ్ శాఖలో రూ.1.82 కోట్లు, అటవీ శాఖలో రూ.1.13 లక్షలు, పశువైద్య శాఖలో రూ.77 వేలు చొప్పున ఖర్చు చేసినట్లు వివరించారు. వీటిపై అక్టోబర్ 19 నుంచి క్షేత్రస్థాయి పరిశీలన పూర్తయిందన్నారు. అక్కడక్కడ జరిగిన లోటుపాట్లకు సంబంధించి రూ.25,429 బాధ్యుల నుంచి రికవరీ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. పండ్ల తోటల పెంపకంలో చనిపోయిన మొక్కల స్థానంలో తిరిగి మొక్కలు నాటించాలన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి అనంత జిల్లా విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, ఎంపీడీఓ కొండన్న, ఏపీడీ శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఆర్‌పీ నాగార్జున, పీఆర్ ఏఈ గురురాజు గుప్త, ఏపీఓలు సూర్యనారాయణ, సుబహాన్, జేఈ షెక్షావలి, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసులు, సూర్యచంద్రారెడ్డి, మండల కో–ఆప్షన్ సభ్యులు మహమ్మద్ రసూల్ పాల్గొన్నారు.

**సామాజిక తనిఖీపై ప్రజా వేదిక**

**ఓడీచెరువు:** గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద మండలంలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఎంపీపీ ఫర్వీన్‌బాను అధ్యక్షతన ప్రొసీడింగ్ అధికారి శివశంకర్, విజిలెన్స్ ఆఫీసర్ రమణారెడ్డి, ఏపీడీ శ్రీనివాస రెడ్డి సమక్షంలో పనుల నివేదిక సమర్పించారు. 14 పంచాయతీల్లో 593 పనులకు సంబంధించి మొత్తం రూ.8.3 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారులు తెలిపారు. వివిధ పనుల్లో అవినీతి జరిగినట్లు గుర్తించి, రూ.21,791 రికవరీకి ఆదేశించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాస రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రాజునాయుడు, అగ్రి బోర్డు చైర్మన్ లక్ష్మీరెడ్డి, ఏపీఓ సోమశేఖర్ రెడ్డి, డీఆర్పీలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రారంభం


స్థానిక నాయకులతో కలసి రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

**గాండ్లపెంట:** మండల పరిధిలోని కల్లుబావి తండా నుంచి గాజులవారిపల్లి పెద్ద తండాకు వెళ్లే రోడ్డును శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ప్రారంభించారు. కల్లుబావితండా నుంచి గాజులవారిపల్లి పెద్ద తండా గ్రామ పంచాయతీ కేంద్రానికి వెళ్లాలంటే గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు గోపాల్‌నాయక్, ఆంజనేయులు నాయక్, బాలకృష్ణ నాయక్ రహదారి ఏర్పాటు విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. రహదారి నిర్మాణానికి సొంత నిధులు వెచ్చించి ముళ్ల పొదలు, రాళ్లను జేసీబీతో చదును చేయించారు. అనంతరం మట్టిరోడ్డు నిర్మించారు. ప్రజలకు రోడ్డు సౌకర్యం కల్పించిన స్థానిక నాయకులను ఎమ్మెల్యే సిద్దారెడ్డి అభినందించారు. కార్యక్రమంలో సామాలగొంది ఎంపీటీసీ లక్ష్మీదేవి, మండల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, జిల్లా కో–ఆప్షన్ సభ్యుడు ఫయాజ్‌అలీ, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు భాస్కరరెడ్డి, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, మండల ఆర్బీకే చైర్మన్ శంకర్‌నాయుడు, బీసీ కన్వీనర్ జక్కల లక్ష్మీనరసింహా గౌడ్, కురుమామిడి సచివాలయ కన్వీనర్ ఖాజావలి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


తలుపుల మండలం గంజివారిపల్లి అంగన్‌వాడీ సెంటర్‌లో రిజిష్టర్ పరిశీలిస్తున్న సీడీపీఓ రాధిక

**ధర్మవరం అర్బన్:** గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని మెడికల్ ఆఫీసర్ శ్వేత తెలిపారు. పట్టణంలోని సిద్దయ్యగుట్టలో ఉన్న వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 50 మంది గర్భవతులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ మనోహర్‌గుప్త, కార్యదర్శి చెన్నప్ప, కోశాధికారి కృష్ణయ్య, సహాయ కార్యదర్శి మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

**తలుపుల:** గర్భిణులు, చిన్నపిల్లలకు పౌష్టికాహారం తప్పనిసరిగా అందించాలని సీడీపీఓ రాధిక అన్నారు. మండలంలోని గంజివారిపల్లి, గంజివారిపల్లి ఎస్సీ కాలనీ, కొవ్వూరివాండ్లపల్లి, భూపతివారిపల్లి తదితర అంగన్‌వాడీ సెంటర్లను శుక్రవారం తనిఖీ చేశారు. ఆయా అంగన్‌వాడీ సెంటర్ల పిల్లల హాజరుపట్టికలను పరిశీలించారు. పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం, పాలు, గుడ్లు మెనూ ప్రకారం అందజేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నిహారిక పాల్గొన్నారు.

## పరిసరాల శుభ్రతతో రోగాలు దూరం


తాడిమర్రిలో తొట్టెలోని నీటిని పారబోయిస్తున్న ఆరోగ్య సిబ్బంది

**తాడిమర్రి:** పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దరిచేరవని సీహెచ్‌ఓ హేమలత అన్నారు. తాడిమర్రి, శివంపల్లి, కునుకుంట్ల, నార్సింపల్లి, ఎం.అగ్రహారం, దాడితోట, చిల్లవారిపల్లి, పిన్నదరి, ఏకపాదంపల్లి, పెద్దకోట్ల, చిల్లకొండయ్యపల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం వైద్య సిబ్బంది డ్రైడే–ఫ్రైడే నిర్వహించారు. శివంపల్లి గ్రామంలో సీహెచ్‌ఓ హేమలత వీధుల్లో తిరుగుతూ పరిసరాలను శుభ్రం చేయించారు. అపరిశుభ్రత నెలకొన్న ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఇంటింటికీ వెళ్లి తొట్టెల్లోని నీటిని పారబోయించారు. ఎక్కువ రోజులు నీటిని నిల్వ చేస్తే దోమలు వృద్ధి చెందుతాయన్నారు. డెంగీ, చికెన్‌గున్యా, మలేరియా తదితర జ్వరాలు సోకే ప్రమాదం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ లక్ష్మీదేవి, ఆరోగ్య కార్యకర్తలు హర్షవర్ధన్ రెడ్డి, జానకీరాం, రంగనాయకులు, ఏఎన్‌ఎం కోమలి, కృష్ణమ్మ, లక్ష్మీకాంతమ్మ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## సజావుగా ఎస్‌ఈఏఎస్ పరీక్ష


బత్తలపల్లిలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ సుధాకర్‌నాయక్

**బత్తలపల్లి:** మండలంలోని 33 పాఠశాలల్లో 3, 6, 9వ తరగతి విద్యార్థులకు (ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో) ప్రధానోపాధ్యాయులు, ఇన్విజిలేటర్స్ సమక్షంలో శుక్రవారం ఎస్‌ఈఏఎస్ (స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే) పరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా మండలానికి గ్రేడ్ నిర్ధారించడం జరుగుతుందని ఎంఈఓ సుధాకర్ నాయక్ తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ చాముండేశ్వరి, సీఆర్పీలు, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**నల్లచెరువు:** మండల పరిధిలోని కుంట్లపల్లి మండల పరిషత్ పాఠశాలను ఎంఈఓ తిరుపాల్ నాయక్ శుక్రవారం సందర్శించారు. పాఠశాలకు సంబంధించిన పలు రికార్డులు, విద్యార్థుల హాజరు రిజిష్టర్లను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందజేస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుబ్బరాజు పాల్గొన్నారు.

### ముఖ్యమంత్రి సభ విజయవంతం చేయాలి

**ఓడీచెరువు:** ఈనెల 7వ తేదీన సీఎం జగన్ శ్రీసత్యసాయి జిల్లాలో పర్యటిస్తారని మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాస రెడ్డి, మండల కన్వీనర్ రాజునాయుడు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవన్‌లో శనివారం సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి సమావేశం నిర్వహిస్తారని పేర్కొన్నారు. సీఎం జగన్ సభ విజయవంతం, జనసమీకరణ, తదితర అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు.

### పరామర్శ

**పుట్టపర్తి టౌన్:** బుక్కపట్నం మండలం జానికంపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటరెడ్డి అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వెంకటరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, సచివాలయాల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

### టీడీపీ సీనియర్ నాయకుడి మృతి

**కదిరి టౌన్:** పట్టణంలోని టీడీపీ సీనియర్ నాయకుడు తాతం అరవింద్‌బాబు గుండెపోటుతో శుక్రవారం మృతి చెందాడు. నల్లచెరువు మండలం జోగన్నపేటకు చెందిన తాతం అరవింద్‌బాబు టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడిగా పని చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కందికుంట వెంకటప్రసాద్, అత్తార్ చాంద్‌బాషా, సీపీఐ సత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, పట్టణ నాయకులు వారి కుటుంబానికి సంతాపం తెలిపారు.

### రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

**కదిరి:** స్థానిక ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ భవనంలో ఈనెల 5వ తేదీన ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.వి.శివారెడ్డి, పి.ఆత్మారెడ్డి శుక్రవారం తెలిపారు. వైద్య శిబిరానికి హైదరాబాద్ మెడివిజన్ ఆసుపత్రి వైద్యులు హాజరవుతారన్నారు.

### ఇరువర్గాలపై కేసుల నమోదు

**కదిరి టౌన్:** మున్సిపల్ పరిధిలోని మశానంపేటలో ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో గొడవపడిన ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. షేక్ చాంద్‌బాషా, రియాజ్ ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా.. మశానం పేటకు చెందిన రహంతుల్లా, సాధిక్ రాంగ్ రూట్లో వచ్చారంటూ గొడవ పడ్డారు. ఈ గొడవలో ఇరువర్గాలకు రక్తగాయాలయ్యాయి. అనంతరం వీరు కదిరి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు.

### యువతి అదృశ్యం

**కదిరి టౌన్:** మున్సిపల్ పరిధిలోని బేరిపల్లి క్వార్టర్స్‌కు చెందిన కృష్ణమూర్తి కుమార్తె వందన అదృశ్యమైనట్లు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కదిరి వ్యవసాయ కార్యాలయంలో సిస్టమ్ ఆపరేటర్‌గా పని చేస్తున్న వందన గురువారం ఉదయం 9 గంటలకు డ్యూటీకి వెళ్లింది. సాయంత్రం అయినా ఇంటికి రాలేదు. వందన అన్న నిరంజన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

### పేకాటరాయుళ్ల అరెస్ట్

**ఓడీచెరువు:** మండల కేంద్రంలోని తంగేడుకుంట పంచాయతీ మద్దకవారి పల్లి సమీపంలో పేకాట ఆడుతున్న 10 మంది జూదరులను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.11,520 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ మల్లికార్జున రెడ్డి తెలిపారు. దాడిలో ఏఎస్‌ఐ కిశోర్ రెడ్డి, కానిస్టేబుళ్లు లోకేష్, బాబ్‌జాన్ పాల్గొన్నారు.

### కేబుల్ దొంగల అరెస్ట్

**నల్లచెరువు:** మండల పరిధిలోని పలు గ్రామాల్లో వ్యవసాయ బోర్ల వద్ద కేబుల్ దొంగిలిస్తున్న ఇంద్రసేనారెడ్డి, ఎస్.శ్రీనివాసులు, బి.శ్రీనివాసులు, శ్రీనాథ్‌రెడ్డి.కె.క్రిష్టప్పను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ లింగన్న తెలిపారు. వారి నుంచి 12 కేజీల కాపర్‌ను స్వాధీనం చేసుకున్నారు. చెరువువాండ్లపల్లి వద్ద నిందితులను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు. కోర్టు నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించిందని పోలీసులు తెలిపారు.

### ఏపీపీఎస్సీ మెంబర్‌కు సన్మానం


ఏపీపీఎస్సీ మెంబర్ రమణారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

**కదిరి:** ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుడు రమణారెడ్డిని తోటి ఏపీపీఎస్సీ మెంబర్ డాక్టర్ జీవీ సుధాకర్‌రెడ్డి స్వగృహంలో శుక్రవారం పలువురు సన్మానించారు. ఏపీపీఎస్సీ ద్వారా మరిన్ని ఉద్యోగాల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో పీకేఎం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ బాబర్, సీనియర్ కౌన్సిలర్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

### చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

**బత్తలపల్లి:** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వృద్ధుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. బుక్కపట్నం మండలం మదిరేబైలు తండాకు చెందిన శంకరనాయక్ (62) ఆర్డీటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తన తమ్ముడి కుమార్తెను చూసేందుకు గురువారం ఆర్డీటీ ఆసుపత్రికి వచ్చారు. సాయంత్రం రోడ్డు దాటుతున్న సమయంలో బత్తలపల్లి నుంచి ముదిగుబ్బ వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. గాయపడిన ఆయన్ను వెంటనే ఆర్డీటి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య సరోజ బాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### మహిళ ఆత్మహత్యాయత్నం

**ధర్మవరం అర్బన్:** పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురానికి చెందిన సావిత్రి అనే మహిళ కడుపునొప్పి తాళలేక శుక్రవారం మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసింది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శివ, సావిత్రి దంపతులు కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. కొంతకాలంగా సావిత్రి కడుపునొప్పితో బాధపడుతోంది. కడుపునొప్పి ఎక్కువ కావడంతో ఇంట్లోని మాత్రలు ఎక్కువగా మింగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### అనారోగ్యంతో వ్యక్తి మృతి

**ముదిగుబ్బ:** ముదిగుబ్బ బస్ షెల్టర్‌లో శుక్రవారం విజయవాడకు చెందిన 50 సంవత్సరాలు పైబడిన ఓ వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. అనారోగ్య సమస్యల కారణంగా పుట్టపర్తికి చికిత్స నిమిత్తం వచ్చాడు. అయితే అక్కడ గుర్తింపు కార్డు లేకపోవడంతో తిరిగి విజయవాడకు వెళ్లేందుకు మూడు రోజుల క్రితం ముదిగుబ్బకు వచ్చాడు. బస్‌షెల్టర్‌లో పడుకున్న అతడు అక్కడే మృతి చెందాడు. పోలీసులు విచారణ చేపట్టి మృతుడి బంధువులకు సమాచారం అందించారు.

## క్లుప్తంగా

### పేదలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు


గ్యాస్ స్టవ్ అందజేస్తున్న జిల్లా సివిల్ సప్లయిస్ ఆఫీసర్ వంశీకృష్ణారెడ్డి

**ధర్మవరం అర్బన్:** ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉజ్వల పథకం పథకం ద్వారా ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు అందజేస్తున్నట్లు జిల్లా సివిల్ సప్లయిస్ ఆఫీసర్ వంశీకృష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని లక్ష్మీ గ్యాస్ ఎంటర్ ప్రైజెస్ హెచ్‌పీ గ్యాస్ కార్యాలయంలో శుక్రవారం మహిళలకు గ్యాస్ సిలిండర్లు, స్టవ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు ఉజ్వల పథకంలో భాగంగా గ్యాస్ కనెక్షన్లకు 500 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరిలో మొదటి విడతగా 100 మందికి గ్యాస్ కనెక్షన్లు ఇస్తున్నామని తెలిపారు. పేద ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మీ గ్యాస్ ఎంటర్ ప్రైజెస్ నిర్వాహకులు గోవిందచౌదరి, సీఎస్ డీటీ లక్ష్మీదేవి, గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు అనంతసైన, కీర్తి చౌదరి పాల్గొన్నారు.

### ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి


మాట్లాడుతున్న ఎంపీడీఓ పూల నరసింహులు

**తనకల్లు:** ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ పూల నరసింహులు అన్నారు. మండల పరిధిలోని నల్లగుట్లపల్లి వద్ద ఉన్న జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా 150 వరకూ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలన్నారు. ఇంటికి సంబంధించిన బిల్లులను మంజూరు చేస్తామన్నారు. ఇసుక కొరత లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. లేఅవుట్‌లో నీటి వసతి కల్పించాలని పలువురు లబ్ధిదారులు ఎంపీడీఓను కోరారు. నీటి సమస్య లేకుండా చూడాలని కార్యదర్శికి ఆదేశించారు.

### ఎడ్లబండి పైనుంచి జారిపడి వృద్ధుడికి గాయాలు


చికిత్స పొందుతున్న రామాంజనేయులు

**ధర్మవరం అర్బన్:** పట్టణంలోని చిన్నూరు గ్రామానికి చెందిన రామాంజనేయులు ఎడ్లబండి పైనుంచి జారి పడి గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. రామాంజనేయులు ఎడ్లబండిపై వేసిన వేరుశనగ పొట్టుపై కూర్చున్నాడు. బండి ఓ పక్కకు వాలడంతో పొట్టుపై కూర్చున్న రామాంజనేయులు ప్రమాదవశాత్తూ జారి కిందపడ్డాడు. ఈ ఘటనలో గాయపడని అతడ్ని వైద్య చికిత్సల కోసం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

### కళ్లెదుటే కుమార్తె మృత్యుఒడికి..


మృతి చెందిన చిన్నారి అజ్మా

**మదనపల్లె:** తల్లిదండ్రుల కళ్లెదుటే కుమార్తె మృత్యుఒడికి చేరింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు.. బి.కొత్తకోటకు చెందిన చాంద్ బాషా, అయేషా దంపతులు కుమార్తె అజ్మా (2)తో కలసి శ్రీసత్యసాయి జిల్లా కదిరిలోని బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి శుక్రవారం ఆటోలో మదనపల్లెకు బయలుదేరారు. మార్గంమధ్యలో శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు పోలీస్‌స్టేషన్ పరిధిలో స్పీడ్ బ్రేకర్ వద్ద కుమార్తె అజ్మా రోడ్డుపై పడిపోయింది. ఈ ప్రమాదంలో చిన్నారి తీవ్రంగా గాయపడగా.. వెంటనే మదనపల్లెలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనలతో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చారు. పరీక్షించిన వైద్యులు పాప అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

### 12న ఉచిత కంటి వైద్య శిబిరం

**ధర్మవరం అర్బన్:** పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 12వ తేదీన ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిబిరం నిర్వహిస్తామని రోటరీక్లబ్ అధ్యక్షుడు జయసింహ, కార్యదర్శి నాగభూషణ తెలిపారు. స్థానిక సాంస్కృతిక మండలిలో శుక్రవారం రోటరీక్లబ్ సభ్యులు కరపత్రాలను విడుదల చేశారు.

### నేడు సర్వసభ్య సమావేశం

**ఎన్‌పీకుంట:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఆదినారాయణ శుక్రవారం పేర్కొన్నారు.

### 'సామాజిక సాధికార బస్సు యాత్ర' జయప్రదం చేయండి

**తాడిమర్రి/ముదిగుబ్బ:** సామాజిక సాధికార బస్సు యాత్రను జయప్రదం చేయాలని తాడిమర్రి ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి, ముదిగుబ్బ మండల కన్వీనర్ సీవీ నారాయణరెడ్డి, మండల ఇన్‌చార్జ్ ఇందుకూరి నారాయణరెడ్డి, ఎంపీపీ ఆదినారాయణ శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ధర్మవరంలో కాలేజీ సర్కిల్‌లో సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన బహిరంగ సభ జరుగుతుందన్నారు. ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధిని వివరించేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సామాజిక వర్గాలకు చెందిన మంత్రులు పాల్గొంటారన్నారు. సింగిల్‌విండో అధ్యక్షులు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ, సర్పంచులు వైఎస్సార్‌సీపీ నాయకులు తరలి రావాలని కోరారు.

### బాలుడికి తీవ్ర గాయాలు

**తలుపుల:** మండల కేంద్రంలోని ఎగువపేటకు చెందిన సూరి ఇంటి వద్ద శుక్రవారం రౌండ్ స్టెప్స్ కూలిన ఘటనలో కుమారుడు యశ్వంత్, కుమార్తె మౌనికకు గాయాలయ్యాయి. వీరిని వెంటనే 108లో కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి మౌనిక తలకు చికిత్స చేశారు. అనంతరం యశ్వంత్‌ను కర్నూలు ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు చికిత్స చేస్తున్నారు.

### నేడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

**చెన్నేకొత్తపల్లి:** స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ నర్సిరెడ్డి, జెడ్పీటీసీ గోవింద రెడ్డి తెలిపారు. సమావేశానికి రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి హాజరవుతారన్నారు. ఈనెల 7న పుట్టపర్తిలో జరగనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పర్యటన ఉందని, కార్యక్రమంపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. శనివారం సాయంత్రం 4 గంటలకు ధర్మవరం పట్టణంలో నిర్వహించనున్న బస్సుయాత్ర విజయవంతం చేసేందుకు మండలంలోని పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని వారు కోరారు.

### రుణాలు వినియోగించుకోండి

**నల్లచెరువు:** మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంలో శుక్రవారం మేనేజర్ మహాలక్ష్మి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిచారు. పలు గ్రామాల నుంచి సమావేశానికి హాజరైన రైతులకు సహకార సంఘం మంజూరు చేసే రుణాలపై అవగాహన కల్పించారు. మేనేజర్ మాట్లాడుతూ.. క్రాప్ లోన్లు, టూవీలర్, ఫోర్ వీలర్ లోన్లు గొర్రెలు, ఆవులు, గేదెలు కొనుగోలు రుణాలు ఇస్తామన్నారు. అర్హతలు కలిగి ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఈఓ మల్లికార్జున, సహకార సంఘం సిబ్బంది పాల్గొన్నారు.

### కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

**గాండ్లపెంట:** మండల కేంద్రానికి సమీపంలోని చిన్నమిట్ట వద్ద శుక్రవారం సాయంత్రం కారు ఢీకొన్న ఘటనలో వద్దిరెడ్డిపల్లికి చెందిన ఆంజనేయులుకు గాయాలయ్యాయి. వివరాలు.. చిన్నమిట్ట వద్ద జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణానికి వచ్చిన కూలీలను ఆంజనేయులు ఆటోలో పంపించాడు. అనంతరం ఆయన రోడ్డు దాటుతుండగా గాండ్లపెంట వైపు నుంచి కదిరికి వెళుతున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆంజనేయులు కుడిచేయి, కుడికాలు విరిగింది. క్షతగాత్రుడిని వెంటనే 108 వాహనంలో కదిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కారు డ్రైవర్ వాహనాన్ని వదిలి పారిపోయాడని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

### పాఠశాలలో పాము

**తనకల్లు:** మండల పరిధిలోని రత్నేనాయక్ తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం పాము కలకలం సృష్టించింది. పాఠశాలలో వెనుకభాగం నుంచి కిటికీ ద్వారా తరగతి గదిలోకి ప్రవేశించిన పాము బీరువా కిందికి దూరింది. బీరువా కింద పాము కదులుతుండటాన్ని గమనించిన విద్యార్థులు వెంటనే ప్రధానోపాధ్యాయుడు శివశంకర్ దృష్టికి తీసుకెళ్లారు. గమనించిన హెచ్‌ఎం గ్రామస్థులకు సమాచారం ఇవ్వడంతో వారు పామును కర్రలతో తరగతి గది బయటకు తీసుకొచ్చారు. పాఠశాల ముందర చుట్టిముట్టి కర్రెలతో పామును చంపేశారు.

### కరువు జిల్లాగా ప్రకటించాలి

**కదిరి టౌన్:** రాష్ట్రంలో కరువు విలయతాండం చేస్తుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడంలో ఘోరంగా విఫలమయ్యాయని కర్నూలు మాజీ ఎమ్మెల్యే, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు గఫూర్ విమర్శించారు. శ్రీసత్యసాయి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలన్నారు. శుక్రవారం బస్సు జాతా కదిరికి చేరుకుంది. సీపీఎం నాయకులు సుబ్బిరెడ్డి, నరసింహులు ప్రజా సంఘాలు కార్యకర్తలు కాలేజ్ సర్కిల్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకూ భారీ ర్యాలీ చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు ప్రభాకర్, కృష్ణయ్య, రమాదేవి, నాగమణి, వెంకటేష్, నల్లప్ప పాల్గొన్నారు.